# 11. కాశీలో ఎలుక

ఆనాడు కార్తీక సోమవారం

ఛట్ పరబ్ కూడాను

కాశీలో దశాశ్వమేధఘట్టానికి తెల్లవారు వేళ మూడు గంటల నుండి పిల్లలూ పెద్దలూ వస్తునే ఉన్నారు.

నేను నా భార్య ఒక పది రోజులు కాశీలో ఉండాలని వచ్చాము. మాతోనే విజయవాడ నుండి వచ్చిన దంపతులు, సత్రవులో మా పక్కగదిలోనే బస చేశారు. అతని పేరు రంగారావు గారు. రమారమి నా వయసే ఆయన కుంటుంది. వాళ్ళు కూడా మాకు మల్లే కాశీలో పది రోజులుందామనే వచ్చారు. మేమునలుగురం, వారం రోజుల నుండి కాశీలోను చుట్టుపట్ల, చూడవలసినవి కలిసి చూస్తున్నాము.

మరునాడు మూడో సోమవారం. చాల పవిత్రమైన దినం. రంగారావు గారు ధర్మచింతన గలవారు. ఆ పవిత్రమైన దినాన్న రుద్రాభిషేకం చేయాలని అతను సంకల్పించారు. నన్ను కూడా అడిగారు. మంచి పని చేయడానికి నేను కూడా అంగీకరించాను.

రంగారావు గారు చాల సార్లు కాశీ వచ్చారు. అతనికో స్నేహితు డున్నారు. ఆయన పేరు నారాయణ గారు. అతను బియ్యే పాసయ్యారు. ఆంధ్ర దేశం నుండి చాల ఏళ్ళ కిందే అతను కాశీ వచ్చి అక్కడే స్థిర పడ్డారు. కాని, ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. బ్రహ్మచారిగా ఉండి, పౌరోహిత్యం చేస్తున్నారు.

రంగారావు గారు వెళ్ళి నారాయణగారిని పిలుచుకొని వచ్చారు. అందరం కూర్చున్న తరువాత రుద్రాభిషేకం గురించి అతనికి చెప్పారు.

నారాయణ గారు చాల మంచి మనిషి. యాత్రికుల నుండి డబ్బు రాబట్టాలనే తాపత్రయం లేదతనికి. ఆయన ప్రత్యేకంగా కాశీ విద్యాపీఠంలో పౌరోహిత్యంలో పెద్ద పరీక్షలు పాసయ్యారు. ఆయన రంగారావు గారి సంకల్పానికి సంతోషించారు. తప్పకుండా మరునాడు రుద్రాభిషేకం మా చేత చేయిస్తానన్నారు.

అతనో చిన్న సలహా యిచ్చారు.

సాలగ్రామం తెచ్చి, కొబ్బరి కాయలు కొట్టి, ఇంట్లో అభిషేకం చేయడం అందరికీ

తెలిసిన విషయమే. కాని, మరో విధంగా కూడా ఆ పని చేయవచ్చునని అతనన్నారు. అభిషేకానికి వేరే సాలగ్రామాలు అక్కరలేదన్నారు. విశ్వనాథుని ఆలయంలో మూల లింగానికే రుద్రాభిషేకం చేయిస్తానన్నారు. కాని కొంచెం శ్రమ పడాలి. తెల్లవారు ఝామున మూడు గంటలయే సరికి స్నానాదులు ముగించి, విశ్వేశ్వరుని ఆలయం తలుపులు తెరువగానే లోపలికి ప్రవేశిస్తే, శివలింగానికి పక్కనే కూర్చొని రుద్రాభిషేకం చేయవచ్చునన్నారు. అప్పుడు జన సమ్మర్ధముండదు. మనసు తీరా అభిషేకం చేసుకోవచ్చు.

ఇటువంటి గొప్ప అవకాశం జన్మలో లభించడం దుర్లభం.

వారణాసిలో సాక్షాత్తు శివలింగానికి, విశ్వనాథ మందిరంలో రుద్రాభిషేకం చేయడం కన్న మహత్కార్యమింకేముంది?

భగవంతుడే ఆ ఏర్పాటు చేశాడని సంతోషించాం.

ఆ సాయంకాలమే నారాయణగారు అభిషేకానికి కావలసిన పూవులు, పత్రి, పళ్ళు మొదలైన పూజా ద్రవ్యాలు కొని తీసుకువచ్చారు. తాను కూడా మాతో పాటు ఆ రాత్రికి సత్రవులో పడుకున్నారు.

అనుకున్న ప్రకారమే, సోమవారం నాడు, తెల్లవారు వేళ మూడు గంటలకు ముందుగానే లేచి, స్నానం చేయడానికి గంగానదికి బయలుదేరాము.

కాని, దశాశ్వమేధ ఘట్టం చేరేసరికి నాకు నిస్పృహ తోచింది.

ఆ నాడు ఛట్ పరబ్ ఏమో! గ్రామ ప్రాంతాల నుండి స్త్రీలు, పిల్లలు పాటలు పాడుకుంటూ తండోపతండాలుగా వస్తున్నారు. రేవుల నిండా మనుష్యులే. గంగా మయ్యాకి వాళ్ళు పూజలు చేస్తారు. వీళ్ళందరూ, గంగలో స్నానాలు చేసి, విశ్వనాథుడి ఆలయంలో ప్రవేశిస్తే, దేవుడి పక్కన కూర్చొని అభిషేకం చేయడం మాట అటుంచి, దర్శనం దొరకడం కూడా కష్టమవుతుంది.

నాకు మనసు మనసులా లేదు. చేసిన ప్రయత్నాలు వమ్మవుతాయని దిగులు తోచింది.

ఎలా అయితేనేం, చాల శ్రమ పడి, రేవులో చోటు చేసుకొని, స్నానాలు ముగించాము. పట్టుబట్టలు కట్టుకొని, కండువాలు కప్పుకొని నుదుట విభూతి దిద్దుకొని, విశ్వనాథ మందిరానికి బయలు దేరాము.

ఆలయం చేరుకోడానికి గల్లీలలోంచి పోవాలి. మొదటి సందులోకి ప్రవేశించిన తరువాత, నాకు కొంత ధైర్యం కలిగింది. రేవు దగ్గిర కనపడిన జనం సందులో లేరు. వాళ్ళు గంగా దేవి పూజలో నిమగ్నులై ఉన్నారు. గల్లీలలో ఒకరూ ఇద్దరూ తప్ప రద్దీ అన్నది లేదు.

విశ్వనాథుని ఆలయమున్న గల్లీలో దుకాణాలింకా తెరువలేదు. దేవాలయం తలుపులు నాలుగు గంటలకి తెరుస్తారని నారాయణగారు చెప్పారు. పూజారులు మాత్రం, ఒక గంట

ముందు, పక్కనున్న చిన్న తలుపు తీసుకొని లోపలికి పోతారు. అక్కడ శివలింగాన్ని, కుండికను, గర్భ గృహాన్ని కడుగుతారు. అ పనులన్నీ అయిన తరువాతే దర్శనం కోసం తలుపులు తెరుస్తారు.

మేము విశ్వేశ్వరాలయం చేరే సరికి మూడున్నర అయింది. చెప్పాలంటే జనం అట్టే లేరు. అయిదారుగురు యాత్రికులు మాకు మల్లే పట్టుబట్టలు కట్టుకొని, తొలి దర్శనాలకో, అభిషేకాలకో వచ్చారు. వాళ్ళలో యిద్దరు ఆలయానికి ఎదురుగా నున్న దుకాణం అరుగుల మీద కూర్చున్నారు.

ద్వారం దగ్గర నిలబడాలని ముందుకు మేము నడుస్తున్నాము. చాల కాంతి వంతమైన దీపం మీదను వెలుగుతోంది. అక్కడున్న వాళ్ళు మమ్మల్ని చూసి గట్టిగా అన్నారు:

"కిందను చూసుకొని మరీ నడవండి!"

ముందుకు అడుగు వేయవలసిన వాళ్ళం ఒక్కసారి నిలిచి పోయాము. బలిసిన ఎలుక నొకదాన్ని చంపి, ఆలయ ద్వారం ముందే ఎవరో పడేశారు. దాని కడుపులోంచి పేగులు బయటికి వచ్చాయి. నెత్తురు మడుగులో అది పడి ఉంది.

అసలే గల్లీ ఇరుకైనది. పైగా చచ్చిన ఎలుకను ద్వారం ముందే పడేశారు. పవిత్రంగా గంగానదిలో స్నానం చేసి, శ్లోకాలు వేద మంత్రాలు వల్లించుకుంటూ ఆలయంలోనికి పోదామని వచ్చిన వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు. అందరూ మడిగా, పువ్వులు, పళ్ళు, పాలు, గంగాజలం పట్టుకొని, పట్టు శాలువలు కప్పుకొని వచ్చిన వాళ్ళే. అందరూ దూరంగా నిలుచుండి, ముందుకు జరిగితే అపవిత్రులమవుతామని భయంతో ఆ ఎలుకను చూస్తున్నారు. మేము కూడా వాళ్ళలో కలిసి పోయి ద్వారానికి కొద్ది దూరంలో నిలుచున్నాము.

ఎవరికి తోచిన మాటలు వాళ్ళంటున్నారు. ఇంతలో ఎవరో మాట్లాడుకుంటూ అటువేపే వస్తే, అందరం వాళ్ళని ఎలుకను మట్టకుండా ఆపాము. మరో నలుగురు ఆ విధంగానే అపవిత్రం కాకుండా కాపాడాము.

"నాలుగు కావస్తోంది! ఇంకా తలుపులు తెరువరే!" ఒకాయన అన్నాడు.

"ఎలుక గోలలో పడి కాలమే మరచి పోయాం" అన్నాడు మరొకతను.

"ఇక తలుపులు తెరుస్తారు. సిద్ధంగా ఉండండి! " ఒక పెద్దాయన తన వాళ్ళను హెచ్చరించాడు.

నాలుగయింది. ఆలయం తలుపులు తెరచుకునే సుముహూర్తం ప్రాప్తించింది.

అందరం ఆత్రతగా తలుపుల వేపే చూస్తున్నాం.

లోపల నుండి ఘంటా నాదం వినవచ్చింది.

ఆలయం తలుపులు తెరచుకున్నవి.

తొందర తొందరగా అందరం ఎలుక బారి నుండి తప్పించు కొని లోపలికి ప్రవేశించాము.

గర్భ గృహం చాల శుభ్రంగా ఉంది. పాల రాతి నేల మెరుస్తోంది. శివలింగం అతి స్వచ్ఛంగా ఉంది. దిగువనున్న కుండిక నిర్మలంగా ఉంది. లోపల తక్కువ మందే ఉన్నారు.

మేము శివుని సన్నిధిలోనే కూర్చున్నాము. ఆ మహాలింగాన్ని చేతులతో తాకి పూజ చేస్తున్నాము. పంచామృత స్నానం అయిన తరువాత శివలింగాన్ని స్వచ్ఛమైన గంగాజలంతో అభిషేకం చేశాము.

నారాయణగారు సస్వరంగా రుద్రం చదువుతున్నారు. అతని కంఠం కంచు వలె వినిపిస్తోంది.

నా భార్య బిల్వదళాలతో శివుడిని పూజిస్తున్నది.

రంగారావు గారు, వారి భార్య లింగానికి పాలతో అభిషేకం చేస్తున్నారు. ఎంతో వైభవంగా దివ్యమైన కాంతులలో గర్భ గృహం ప్రకాశిస్తోంది.

నేను కూడా పూజ చేస్తున్నాను.

నా మనసంతా పాడయింది.

యాంత్రికంగా నారాయణగారు చెప్పినవి నేను చేస్తున్నాను. నల్లటి శివలింగాన్ని తాకుతూ కూర్చున్నా నాకు దేవుడు కనిపించడం లేదు. అక్కడో చచ్చిన ఎలుక ఉంది. పేగులు బయటకి వచ్చి నెత్తుటి మడుగులో ఉంది.

నా ఆలోచనలన్నీ ఎలుక మీదకే పోయాయి. అందరం శాస్త్రాలు చదివిన వాళ్ళమే. ఆలయానికి పోయే దారిలో, చచ్చిన ఎలుక నలుగురికీ ఇబ్బంది కలిగిస్తుంటే ఎవరం పట్టించుకోలేదు. ఆ ఎలుకను తీసి పక్కకు పారేయాలని కూడా మేమెవరం ప్రయత్నించలేదు. మేమందరం జ్ఞానులం. చచ్చిన ప్రాణిని ముట్టుకుంటే ఎక్కడ మైల పడిపోతామోనని దూరంగా నిలుచున్నాము.

దుకాణదారులు ఎలుకలను చంపుతునే ఉంటారు. చంపితే మాత్రం, నలుగురు నడిచే దారిలో, విశ్వనాథుడి ఆలయ ద్వారం ఎదురుగా పారేయాలా? వాళ్ళనంటే లాభమేముంది.

నన్ను నేను సముదాయించు కున్నాను.

ఎవ్వరికీ లేని ఆరాటం నాకెందుకని అనుకున్నాను.

కాని, ఏదో పెద్ద నేరం చేసినట్లు బాధ పడ్డాను.

ఈ తర్జన భర్జనలలో రుద్రాభిషేకం పూర్తయింది.

నైవేద్యం పెట్టి లేవమని నారాయణగారు అంటున్నారు. బిల్వదళాలు చెవిలో పెట్టుకున్నాం.

తీర్థం పుచ్చుకున్నాం. ఆలయంలోని ఇతర విగ్రహాలను చూసి పైకి వచ్చాము.

ఇంకా వెలుగు రాలేదు.

ద్వారం ఎదుట ఆ ఎలుక అలాగే పడి ఉంది.

ఆలయ ప్రాకారంపై చేతులు వేసి తడుముకుంటూ ఒకాయన ద్వారం వేపు వస్తున్నాడు. రోజూ అతడు అలాగే వస్తాడు కాబోలు. ఎవరూ అతనికి తోడు లేరు. గంగలో స్నానం చేసి, దేవుడి గుడికి వచ్చినట్లున్నాడు.

అతనిని చూసి ఎవరూ కిందకి చూసి నడవమని హెచ్చరించ లేదు. అందరూ అతడేం చేస్తాడో చూడాలని నిలుచున్నారు.

అడుగులలో అడుగులు వేసుకుంటూ అతడు ముందుకు వచ్చాడు. ఆలయం మెట్లు ఎక్కబోతూ అతడు ఆ ఎలుకను తొక్కాడు. వెంటనే ఆగిపోయాడు. క్షణం ఆలోచించి కిందకి వంగి చేతులతో తడిమాడు. అతడు మమ్మల్ని ఏమైనా అంటాడని అనుకున్నాం. ఎవరినీ అతను నిందించలేదు. అసహ్యించుకోకుండా, చచ్చిన ఎలుకను చేతుల్లోకి తీసుకున్నాడు.

"అయ్యో! ఎంత పనయింది?" గట్టిగానే అన్నాడు. తరువాత మళ్ళా అన్నాడు.

"నువ్వు చాలా పుణ్యం చేశావు. కాశీలో చచ్చిపోవాలని మేము ఏళ్ళ తరబడి ఎదురు చూస్తున్నాము. చావు రాక ఇంకా బ్రతికి ఉన్నాము. కోరకుండా మృత్యువు నిన్ను వరించింది. అంతా విశ్వేశ్వరుడి అనుగ్రహమే. కాని, నువ్విలా అనాధగా పడి ఉండడం బాగులేదు. పునర్జన్మ మరి లేకుండా నిన్ను మణికర్ణికకు తీసుకుపోయి సంస్కారం చేస్తాను".

కళ్ళుండి, శాస్త్రాలు చదివిన పండితులు చేయలేని పని కోసం, ఆ కళ్ళు లేని మనిషి తడుముకుంటూ ముందుకు పోయాడు.